తప్పు తెలుసుకున్న ఆ సంపన్నుడు వెంటనే ఆ స్వామి దగ్గరికి వెళ్ళి నమస్కరిస్తూ చెప్పాడు.

"నా కళ్ళు తెరిపించారు స్వామి. ఇవి స్వీకరించండి."

అతనిచ్చిన ఆ బంగారు నాణాలని స్వామి ఆ గ్రామంలోని బిచ్చగాళ్ళకి పంచి వెళ్ళిపోయాడు. త్వరలోనే ఆ సంపన్నుడు దానశీలిగా పేరు పొందాడు.

## 39. శివుడే చెప్పాడు

ఓ కార్తీక పౌర్ణమినాడు ఓ శివభక్తుడు ఓ శివాలయానికి వెళ్ళాడు. తను కాశీ నుంచి తెచ్చిన గంగాజలంతో శివలింగానికి అభిషేకం చేయాలన్న తలంపుతో భక్తుల క్యూలో నిలబడ్డాడు.

కాసేపటికి అతని వంతు వచ్చింది. అయితే పూజారి అతన్ని ఎగాదిగా చూసి చెప్పాడు.

"నీకు గర్భగుడిలోకి ప్రవేశం లేదు."

"ఏం? ఎందుకని?" బిత్తరపోతూ ప్రశ్నించాడా భక్తుడు.

"శివాలయంలోకి పంచె కట్టుకుని తప్ప పేంట్ షర్టలతో రాకూడదని నీకు తెలీదా?" ప్రశ్నించాడా పూజారి.

"ఏమిటి? శివుడే ఈ నియమం ఏర్పరిచాడా?" నమ్మలేనట్లుగా చూస్తూ అడిగాడా భక్తుడు.

"అవును. కావాలంటే నువ్వే ఆ పరమశివుణ్ణి అడిగి తెలుసుకో." వెటకారంగా బదులు చెప్పాడా పూజారి.

"అలాగే. ఆయన్నే అడిగి తెలుసుకుంటాను." కోపంగా వెళ్ళిపోయాడా భక్తుడు.

వారం తర్వాత ఆ భక్తుడు ఆ పూజారికి మార్కెట్లో తారసపడ్డాడు. అతన్ని చూసి చెప్పాడు ఆ పూజారి.

"రేపటితో కార్తీకమాసం అయిపోతుంది. ఇవాళ పంచె కట్టుకుని పుత్తరీయంతో వస్తే శివుడికి నీ చేతులతో అభిషేకం చేసుకోవచ్చు."

"రాను." స్థిరంగా చెప్పాడా భక్తుడు.

"అదేం? నీకు శివుడంటే భక్తి లేదా?" ప్రశ్నించాడు పూజారి.

"ఉంది. కాని రాను."

"దేనికి రావు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు పూజారి మళ్ళీ.

"ఎందుకంటే నిన్న రాత్రి శివుణ్ణి గుడికి వచ్చే భక్తుల దుస్తుల విషయంలో మీరు చెప్పిన నియమాల గురించి అడిగాను. తను ఎన్నడూ అలాంటి నియమాలని విధించలేదని, అసలు తను ఎన్నడూ మీ గుళ్ళోకే అడుగు పెట్టలేదనీ స్వయంగా ఆ పరమశివుడే చెప్పాడు."

ఆ సమాధానంతో పూజారి మొహం మాడిపోయింది.

## 40. దేవుని రాక

ప్రతీ శనివారం భాగ్యవతి తన యిష్టదైవమైన శ్రీనివాసుడికి నిత్యపూజ చేస్తుంది. గత ఏడేళ్ళుగా ఆమె ఆ నియమాన్ని పాటిస్తూ వస్తోంది.

ఆ శనివారం కూడా భాగ్యవతి శ్రీనివాసుడికి నైవేద్యం సమర్పించింది. ఇంతలో బెల్ మోగితే వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా పోస్ట్‌మేన్. అతనిచ్చిన కార్డు అందుకుని అందులో రాసి వున్నది చదివింది. ముత్యాల్లాంటి అక్షరాలతో వున్న ఆ కార్డులో యిలా రాసి వుంది.

డియర్ భాగ్యవతి,

ఈ శనివారం నేను మీ కాలనీకి వస్తున్నాను. మీ యింటికి భోజనానికే సుమా! అన్నీ సిద్ధంచేసి వుంచు.

నీ,

శ్రీనివాసుడు.